నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 13 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

## వందే భారత్ రైలును ప్రారంభించిన మేయర్

ఖమ్మం స్టేషన్‌లో వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం, మార్చి 12 : కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్-విశాఖపట్నం(02707) మధ్య మరో వందే భారత్ రైలును ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా పది రైళ్లను మంగళవారం ప్రారంభించారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఈ ఎక్స్‌ప్రెస్ రైలును నగర మేయర్ పునుకొల్లు నీరజ జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో మేయర్‌తో పాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య, స్వాతంత్ర్య సమరయోధుడు ఎం.వెంకటసుబ్బారెడ్డి, డీఎస్‌టీఈ ప్రార్థమేశ్, కాకాడే, ఏసీఎం వి.రవికాంత్, సీసీఐ ఎండీ ఫర్, ఎస్ఎస్జీఎన్‌వీ.ప్రసాద్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, జీఆర్‌పీ సీఐ వెంకటేశ్వర్లు, సీజీఎస్ఆర్ ప్రసన్నకుమార్, సీపీఎస్ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేయాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

వీవీ పాలెం రైతువేదికలో మంత్రి సందేశాన్ని వింటున్న అధికారులు, రైతులు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 12 : రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతునేస్తం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని వీ వెంకటాయపాలెం, కూసుమంచి, బోనకల్, తనికెళ్ల, కొర్లగూడెం రైతువేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి 414 మంది రైతులతోపాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయనిర్మల, ఆయా డివిజన్, మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొనే సమస్యలను శాస్త్రవేత్తల ద్వారా అవసరమైన సమాచారం తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మామిడిపిందె రాలుడు-నివారణ చర్యలపై ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి సీనియర్ శాస్త్రవేత్త సుచరిత అవగాహన కల్పించారు. అధిక ఉష్ణోగ్రత ప్రభావంతో కలిగే నష్టాల నివారణపై జగిత్యాల పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాస్, సెంద్రియ వ్యవసాయ సాగుపై శాస్త్రవేత్త సీహెచ్ ప్రగతికుమారి వివరించారు.

# ఉచిత విద్యుత్ ఉత్త మాటేనా!

- కొంతమందికి యథాతథంగా కరెంట్ బిల్లులు
- 'ఆన్‌లైన్‌లో పొరపాటు' అంటున్న అధికారులు
- లబ్ధిదారుల్లో మొదలైన ఆందోళన
- తెల్ల రేషన్‌కార్డున్నా బిల్లు కట్టాల్సిందేనా?
- గ్రామసభల్లో దరఖాస్తులిచ్చి ప్రయోజనమేమిటి?
- ప్రశ్నలు సంధిస్తున్న వినియోగదారులు
- గ్యాస్‌బండ గ్యారెంటీపైనా అనుమానం

ఆరు గ్యారెంటీల గ్రామసభ (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 12 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో రెండు గ్యారెంటీలను అమలు చేసిన సంగతి విదితమే. ప్రస్తుతం ప్రారంభమైన మరో రెండు గ్యారెంటీలు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్‌బండపై వినియోగదారుల్లో అయోమయం నెలకొన్నది. కేవైసీ కోసం తెల్లవారుజాము నుంచే గ్యాస్ ఆఫీస్‌ల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని, ఎప్పటిలాగే రూ.1000కే గ్యాస్‌బండ కొనుగోలు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక 200 యూనిట్ల లోపే కరెంట్ వాడుకున్న వారికి బిల్లులు వస్తుండడంతో ఆశ్చర్యపోతున్నారు. గ్రామసభల్లో దరఖాస్తున్న చేసుకున్న తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉన్నవారికి సైతం కరెంటు బిల్లులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 2,82,439 మంది విద్యుత్ వినియోగదారులు ఉండగా.. తెల్ల రేషన్‌కార్డులు ఉన్నవారు 2,93,300 మంది ఉన్నారు. రేషన్‌కార్డు లేని వారు తమకు కార్డులేదని బాధపడుతుంటే.. కార్డు ఉండి కూడా తమకు ప్రయోజనం లేదని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలు మాటలకే పరిమితమై ఆచరణకు సాధ్యం కావడం లేదని ఆరోపిస్తున్నారు.

### ఉత్తుత్తి గ్రామసభలేనా!

జిల్లావ్యాప్తంగా ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. కానీ.. అందులో తప్పులు దొర్లడంతో మళ్లీ గ్రామాల్లో రీ సర్వే చేశారు. అయినా తెల్లకార్డులు ఉన్నవారికి కూడా జీరో బిల్లు రాలేదు. దీంతోపాటు మరో కొత్త పథకం ఇందిరమ్మ ఇల్లు కూడా సోమవారం అమలు చేశారు. దాని పరిస్థితి కూడా అంతేనేమో అనిపిస్తున్నది. తెల్ల రేషన్‌కార్డును పరిగణనలోకి తీసుకోవడమే ఈ గందరగోళానికి కారణంగా లబ్ధిదారులు అంటున్నారు. రైతుబంధు, రైతుబీమా ఇచ్చినట్లే కార్డు ప్రామాణికం లేకుండా ఇస్తే పథకాలు అమలు జరుగుతాయని చెబుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి నిబంధనలు పెట్టకుండా పథకాలు అమలు చేశారని గుర్తు చేసుకుంటున్నారు.

### మాది పేద కుటుంబం

కూలి చేసుకునే కుటుంబం మాది. మాకు రేషన్‌కార్డు ఉన్నా కరెంటు బిల్లు వచ్చింది. ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు పెట్టుకున్నాం. మళ్లీ ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లమంటే అక్కడ కూడా దరఖాస్తు ఇచ్చాను. బిల్లు కట్టాలా.. వద్దా.. కూడా తెలియడం లేదు. బిల్లు కట్టకపోతే కరెంటు కట్ చేస్తారు. కూలి పనులకు పోయే మేము ఆఫీసుల చుట్టూ తిరగలేం.

**- జక్కుల స్వప్న, ప్రశాంతినగర్, లక్ష్మీదేవిపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

### రేషన్‌కార్డు కోసం చూస్తున్నాం..

తెల్ల రేషన్‌కార్డు లేదు. దరఖాస్తు పెట్టాం. కార్డు రాకుండానే సర్వే చేశారు. కరెంటు వాళ్లు వచ్చారు.. రాసుకున్నారు. మాకు ఉచిత కరెంటు రాదంట. గ్యాస్ కూడా రాదు. కొత్త కార్డులు ఎప్పుడు ఇస్తారో.. ఇచ్చినా దానికి ఎన్ని కొర్రీలు పెడతారో. పథకాలు రాని వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోమంటున్నారు. మాలాంటి పేద కుటుంబాలకు ఇన్ని నిబంధనలు పెడితే ఎలా?

**- వాంకుడోత్ సరోజ, తిప్పనపల్లి, చంద్రుగొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

### ఆన్‌లైన్‌లో పొరపాట్లు జరిగాయి..

ప్రభుత్వం లాంఛనంగా ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించింది. ఇప్పటికే అర్హులందరికీ జీరో బిల్లులు ఇచ్చాం. కొన్నిచోట్ల ఆన్‌లైన్‌లో ఫోన్ నెంబర్ లేదా బిల్లు నెంబర్ మ్యాచ్ కాకపోవడంతో బిల్లు వచ్చింది.. వీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బిల్లు చెల్లించవద్దు. మళ్లీ ఆన్‌లైన్‌లో సరిచేస్తారు. ఎంపీడీవో కార్యాలయాల వద్ద కౌంటర్లు ఏర్పాటు చేశాం.. అక్కడకు వెళ్లి సరిచేయించుకోవాలి.

**-రమేశ్, విద్యుత్ శాఖ ఎస్ఈ, భద్రాద్రి కొత్తగూడెం**

## పేదలకు వరం.. కల్యాణలక్ష్మి పథకం

**చెక్కుల పంపిణీలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, మార్చి 12: గత కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంలా నిలిచాయని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా పేద కుటుంబాల్లోని తల్లిదండ్రులు తమ కుమార్తెల వివాహాలను ఘనంగా జరిపించుకుంటున్నారని అన్నారు. మండలంలో 27 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంగళవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఆడపిల్లల వివాహాలు నిరుపేద తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతోనే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంతటి బృహత్తర పథకాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఈ పథకాలు వచ్చాక ఆడపిల్లల తల్లిదండ్రులు పెద్దగా ఆర్థిక ఇబ్బందులు పడకుండా తమ కుమార్తెల వివాహాలను వైభవంగా జరిపించుకుంటున్నారని అన్నారు. ఈ పథకాల ద్వారా రూ.1,00,116 చొప్పున అందుతున్న సాయం పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని అన్నారు. ఈ ఘనత అంతా గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది మాత్రమేనని గుర్తుచేశారు. అదేవిధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇటీవలి భద్రాచలం పర్యటనలో భాగంగా దుమ్ముగూడెం మండలంలోని ఐదుగురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించి ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తెల్లం సీతమ్మ, రేసు లక్ష్మి, అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, మడకం రామారావు, తోట రమేశ్, పొడియం సుబ్బారావు, కొమ్ము రంజిత్, రామిరెడ్డి, దామెర్ల శ్రీనివాస్, కెల్లా శేఖర్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో 1,900 ఉద్యోగాల భర్తీ : డిప్యూటీ సీఎం

భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కొత్తగూడెం సింగరేణి, మార్చి 12 : సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏడాదిలో సింగరేణి ఆధ్వర్యంలో దాదాపు 1,900 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఇందులో గత వారం 489 ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, మరో 1,352 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లో నిర్మించనున్న సింగరేణి అతిథి గృహం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 134 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణి సంస్థకు హైదరాబాద్‌లో అతిథి గృహం లేకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు, అధికారుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించిందన్నారు. కార్యక్రమంలో సీఎండీ బలరాంనాయక్, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

## 16న జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెం టౌన్, మార్చి 12 : జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 16న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీపై, మీకు తెలిసిన వారిపై, మీ బంధువులపై ఏమైనా కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. యాక్సిడెంట్, సివిల్, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, ట్రాఫిక్ చలానా తదితర కేసులను రాజీ చేసుకొనే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

**రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 12 (నమస్తే తెలంగాణ)/మామిళ్లగూడెం : ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. స్వీప్ నిర్వహణ, పెండింగ్ ఓటర్ల దరఖాస్తుల వంటి అంశాలపై మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీసీలో ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల పాల్గొన్నారు. వీసీలో ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాలు, నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ సిబ్బంది శిక్షణ తదితర అన్ని అంశాలతో కూడిన ప్రణాళిక రూపొందించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు అవగాహన కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో ప్రచారం కల్పించాలని తెలిపారు.వీసీలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, వేణుగోపాల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల.. అదృష్టానికి చిరునామా

- కృషి, పట్టుదల మహిళల విజయానికి సూచికలు
- సంక్షేమ పథకాలు, షీ టీంలు మహిళలకు వరాలు
- మహిళా దినోత్సవంలో మేయర్, ట్రైనీ ఐపీఎస్

విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మేయర్

ఖమ్మం వ్యవసాయం, మార్చి 12: ఆడపిల్లలు అదృష్టానికి చిరునామాలని కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవంలో భాగంగా ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జిల్లా సంక్షేమ అధికారి రాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం మహిళలు పురుషులతోపాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు, షీటీం వంటి వ్యవస్థలు మహిళలకు ఎంతగానో ఉపయోగకరంగా నిలిచాయని గుర్తుచేశారు. అనంతరం ట్రైనీ ఐపీఎస్ మానిక మాట్లాడుతూ.. సమాజంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే ఆర్థిక వనరులతో పనిలేదని, కేవలం కృషి, పట్టుదల ఉంటే సరిపోతుందని అన్నారు. అవి మాత్రమే మహిళలకు విజయ సోపానాలుగా నిలుస్తాయని అన్నారు. బాలికలు ముఖ్యంగా సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయా రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలను అధికారులు సత్కరించారు. తరువాత కేజీబీవీలు, టీఎస్ఆర్‌జీసీ విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఫాతిమా జోహార్, భారతీరాణి, భూలక్ష్మి, నీలోహన, కవిత, కమలప్రియ, బాలాత్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.

హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

**అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

కొత్తగూడెం అర్బన్, మార్చి 12 : తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట మండుటెండలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు 5జీ ట్యాబ్‌లు ఇవ్వాలని, మే నెలలో టీచర్లు, హెల్పర్లకు ఒకేసారి వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చీపుర్లు, వంట పాత్రల వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిందిపోయి.. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాలను ప్రవేశపెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, వీరన్న, సత్య, భూక్యా రమేశ్, పాయం రాధాకుమారి, విజయ, కళావతి, రాధ, సూరమ్మ, హేమలత, కృష్ణవేణి, లలిత, మరియ, అచ్చమ్మ, రమ్య, శకుంతల, సారమ్మ, ఫాతిమా, సావిత్రి, నిర్మల, భవాని, వరలక్ష్మి పాల్గొన్నారు.

## బయలుదేరిన పది నిమిషాలకే..

- రోజూ వెళ్లి వచ్చే మార్గంలోనే కాపు కాచినట్లుగా ప్రమాదం..
- మిర్చి ఏరేందుకు ఏపీకి వెళ్తుండగా తెల్లవారుజామున ఐదు గంటలకే ఘోరం..
- చెరకుతోటలోంచి దూసుకొచ్చి ముందు టైరుకు బలంగా తగిలిన అడవి పంది..
- ఒక్క ఉదుటున పల్టీకొట్టిన ఆటో.. ఆరుగురు మహిళా కూలీలకు గాయాలు..
- అందులో ఒకరు దుర్మరణం..
- మృతురాలు, క్షతగాత్రులది సూర్యాపేట జిల్లా..
- ఆటోలో పదిహేను మందికిపైగా ప్రయాణం.. హ్యాండిల్ తిరగక ప్రమాదం

రామచంద్రాపురం వద్ద పల్టీ కొట్టిన ఆటో, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు

కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 12: రోజూ వెళ్లి వచ్చే మార్గంలోనే కాపు కాచినట్లుగా ఓ ప్రమాదం జరిగింది. ఏపీలో మిర్చి ఏరేందుకు తెల్లవారుజామున ఐదు గంటలకే ఆటోలో బయలుదేరిన మహిళా కూలీలు ఆ తరువాత పది నిమిషాలకే ప్రమాదం బారిన పడ్డారు. చెరకుతోటలోంచి దూసుకొచ్చిన ఓ అడవి పంది వీరు ప్రయాణిస్తున్న ఆటో ముందు టైర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో ఒక్కసారిగా పల్టీ కొట్టడంతో వారిలో కొందరు గాయపడ్డారు. వారి హాహాకారాలతో ఆ రోడ్డు మార్గంలో అప్పటికే పొలాలకు వెళ్తున్న పలువురు రైతులు వచ్చి ఒక్కొక్కరినీ బయటకు తీశారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కిష్టాపురానికి చెందిన 15 మందికి పైగా మహిళా కూలీలు మిర్చి తోటలు ఏరేందుకు ఏపీ ఎన్‌టీఆర్ జిల్లా పెనగంచిప్రోలు వద్ద గల గోకినేనిపాలేనికి కొద్ది రోజులుగా ఆటోలో వెళ్లి వస్తున్నారు. మంగళవారం కూడా తెల్లవారుజామున ఐదు గంటలకు అదే ఆటోలో రోజూ మాదిరిగానే కిష్టాపురంలో బయలుదేరారు. ఆ ఆటో నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం సమీపంలోకి వచ్చింది. ఇంతలోనే ఆ రోడ్డు పక్కన ఉన్న చెరకుతోటలోంచి ఓ అడవి పంది ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొచ్చింది. నేరుగా ఆటో ముందు టైర్‌కు బలంగా తగిలింది. అప్పటికే ఆటో వేగంగా వస్తుండడం, డ్రైవర్ పక్కన మరో నలుగురు కూర్చొని ఉండడం వంటి కారణాలతో ఆ సమయంలో హ్యాండిల్ తిరగలేదు. దీంతో ఒక్కసారిగా ఆటో పల్టీ కొట్టింది. ఆటోలోని కూలీలంతా ఒకరిమీద మరొకరు పడ్డారు. వారిలో కొందరికి ఆటో కడ్డీలు గుచ్చుకున్నాయి. ఆటో పల్టీ శబ్దం రావడం, మహిళల హాహాకారాలు విన్పించడంతో అప్పటికే అటుగా పొలాలకు వెళ్తున్న పలువురు రైతులు పరుగున వచ్చి చూశారు. ప్రమాదాన్ని గమనించి ఆటోలోని వారందరినీ బయటకు తీశారు. ఆ కూలీల్లో కిష్టాపురానికి చెందిన పెద్దపొంగు పార్వతి (45) అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను నేలకొండపల్లి ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో స్థానికులు ఆమెను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతిచెందింది. అలాగే ఆ కూలీల్లోని రాధమ్మ, జ్యోతి, ఆరోగ్యం, నాగమ్మ, సునీత, నర్సమ్మకు తీవ్రగాలయ్యాయి. ఈలోపు నేలకొండపల్లి పోలీసులు కూడా ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను నేలకొండపల్లి ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొందరు నేలకొండపల్లిలోనే చికిత్స పొందుతున్నారు. వారిలోనూ ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై తోట నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.